# పలకరింపు


-పోరంకి దక్షిణామూర్తి

నేనూ, రాధాకృష్ణమూర్తీ వెంకటసుబ్బయ్యగారిని పలకరించివద్దామని యలుదేరాం. ఆయన్ని చూసి కొన్నేళ్ళయింది.

ఆయన ఎక్కడో ఊరి చివర, విసిరేసినట్టు దూరంగా ఉంటున్నారు. న్నది సొంత ఇల్లే. భార్యాపిల్లలూ ఉన్నారు. కాని ఎవరూ ఆయన గ్గరలేరు!

ఆయన ఒక్కరూ ఆ ఇంటిని అంటిపెట్టుకొని ఏళ్ళ తరబడీ అలా ఉంటున్నారో; ఎందుకు ఉంటున్నారో ఎవరికీ తెలీదు.

ఎవరి సమస్యలు వారివి! ఎవరి అవసరాలు వారివి! ఎప్పుడూ తమవైపు నుంచి ఇతరులను చూడటమే కాని



ఇతరుల వైపునుంచి తమను చూసుకోడం ఎంతమందిక చేతనవును?

వెంకటసుబ్బయ్యగారు మాకు చాలా కాలం నుంచి తెలుసు. ఎప్పుడూ పదిమంది మధ్యా, చిల్లోబొల్లోమంటూ హడావిడిగా, మంచి కలుపుగోలుగా మసలిన మనిషి. ఉద్యోగం మానేశాక ఊరి చివర ఇలా ఒంటరిగా

ఉండిపోవడం ఆశ్చర్యమే అనిపించింది మాకు. అంతేకాక, రవ్వంత జాలికూడా ఉంది.

'పాపం ఒంటరివారే! అయిన వాళ్ళెవరూ దగ్గరలేనందుకు అప్పుడప్పుడూ మనమైనా వెళ్ళి యోగక్షేమాలు కనుక్కుంటూ ఉండొచ్చు కదా!' అనిపించింది. ఆ వయస్సులో ఒంటరితనం ఎవరికయినా దుర్భరమే కదా!

అంతకు ముందెప్పుడూ మేము ఆయన ఇంటికి వెళ్ళలేదు. నంబరు గుర్తుపెట్టుకొని వాకబు చేసుకొంటూ వెళ్ళి ఇల్లు పట్టుకొనే సరికి బాగా పొద్దెక్కింది.

ఐదారు గదుల ఇంటిచుట్టూ విశాలంగా ఖాళీ స్థలముంది. ఇంటికి పెద్దగేటుంది.

మేమక్కడికి చేరేసరికే, గేటుముందు ఐదారుగురు చిన్నపిల్లలు గ్లాసులు పట్టుకొని నిలబడి ఉన్నారు.

గేటుకు లోపలివైపు తాళంవేసి ఉంది. కాని సింహద్వారం తెరిచే ఉంది.

లోపల మనిషి అలికిడి మాత్రంలేదు!

మేము ఆ గేటు దగ్గరికే వచ్చి ఆగిపోవడం చూసి, "తాతా, ఎవరో వచ్చిన్రు!" అంటూ అరిచింది ఒక పాప. ఆ తర్వాత తక్కిన పిల్లలూ అరిచారు.

"ఆగండర్రా, వస్తున్నాను!" అంటూ లోపలి నుంచి వెంకట సుబ్బయ్యగారి గొంతు వినిపించింది.

మమ్మల్ని చూసి పిల్లలు ముసిముసి నవ్వులు నవ్వారు.

వెంకట సుబ్బయ్యగారు ఒక గిన్నె పట్టుకొని గుమ్మంలోకి వచ్చారు.

"లోపల పనిలో ఉంటే ఏమిట్రా మీగోల? కాస్సేపు ఉండలేరూ?" అంటూ అరిచారు వెంకటసుబ్బయ్యగారు.

"లొల్లిజేస్తవేం, తాతా! ఇగో- నీకోసానికి ఎవరో వచ్చిన్రు!" అన్నారు పిల్లలు, మమ్మల్ని చూపిస్తూ.

అప్పుడు మా ఉనికిని గమనించి ఆయన ఉండమన్నట్టుగా చేత్తో సంజ్ఞచేసి, లోపలికి వెళ్ళి తాళం చెవి తెచ్చి, గిన్నెతో గేటు దగ్గరికి వచ్చారు.

నమస్కారాలు అయిన తర్వాత గేటు తాళం తీసి మమ్మల్ని లోపలికి రమ్మన్నారు.

వచ్చిన పిల్లలు చేతిలో గ్లాసులు చూపిస్తూ గేటు దగ్గరే నిలబడ్డారు.

"ఏమర్రా! ఇప్పుడా రావడం? పొద్దునే రావద్దూ? వెళ్ళండి. ఒకగంట తర్వాత రండి!" అని గట్టిగా అన్నారు.

"లే లే! రేపటి సంది. పొద్దుగాల్నే వస్తం తాతా!" అంటూ ఆయన చుట్టూ మూగారు పిల్లలు.

ఆయన మావేపు చూసి ముసిముసిగా నవ్వి, గిన్నెలో మిగిలిన పాలు ఆ పిల్లల గ్లాసుల్లో పోశారు. వాళ్ళ వెనకాల ఒక పిల్ల ఒట్టి చేతులతో నిలబడి ఉంది. చింపిరి జుట్టూ మాసిన బట్టలూ!

"ఎవరో కొత్త పిల్ల లాగుంది" అని మాతో చెబుతున్నట్టుగా అని...

"గ్లాసు తెచ్చుకోలేదా? ఉండు!" అంటూ గబగబా లోపలికి వెళ్ళి గ్లాసుతెచ్చి, ఆ గిన్నెలో మిగిలిన పాలు ఆ పిల్లకిచ్చారు.

పిల్లలందరూ ఒకే సమయంలో గటగటా పాలు తాగేసి మూతులు తుడుచుకున్నారు. చివరి అమ్మాయి ఇచ్చిన గ్లాసు గిన్నెలో వేసుకొని గేటుకు మళ్ళీ తాళంపెట్టి మమ్మల్ని లోపలికి తీసుకువెళ్ళారు వెంకటసుబ్బయ్యగారు.

"మంచినీళ్ళు తెస్తానుండండి- అసలే వేసవి కాలం!" అంటూ లోపలికి వెళ్ళారు.

ముందరి గదే ఆయన డ్రాయింగ్ రూమ్-కమ్-స్టడీ. అందులో రెండే కుర్చీలున్నాయి.

మధ్యలో నైలాను నవారు కుక్క మంచం ఉంది. దాని పక్కనున్న బల్లమీదా, అలమరాలోనూ, నేలమీదా పుస్తకాలు దొంతర్లుగా పేర్చి ఉన్నాయి. కొన్ని నేలమీద అడ్డదిడ్డంగా పడి ఉన్నాయి. చాలా రోజుల నుంచి దుమ్ము దులిపినట్టు లేదు.

ఒకవేపు 'తెలుగు వర్ణమాల' ఛార్టు మరోవేపు 'ఇంగ్లీషు వర్ణమాల' ఛార్టు. మధ్యలో శరీరావయవ భాగాల ఛార్టు గోడకు వేలాడుతున్నాయి. గదికి నాలుగు వేపులా సాలీళ్ళు గూళ్ళు కట్టుకున్నాయి.

మా కృష్ణమూర్తి ఒక కుర్చీలో కూలబడ్డాడు. రెండో దాంట్లో వార్తాపత్రికలేవో ఉన్నాయి.

వాటిని తీసి నేను కూర్చోబోతూంటే, వెంకట సుబ్బయ్యగారు, "ఆగాడు! కుర్చీ విరగ్గొట్టకు. అసలే అది మూడు కాళ్ళ ముసలమ్మ." అంటూ నాకు కుక్కిమంచం చూపించారు.

ఆయన చేతిలో మంచినీళ్ళ సీసాలున్నాయి.

"నాకు మంచు బీరువాలేదు. మంచినీళ్ళ కుండలూ లేవు! సీసాలెత్తుకుని తాగెయ్యండి. నీళ్ళింకా వేడెక్కలేదు!" అన్నారాయన.

"అయ్యో, వెంకటసుబ్బయ్యగారూ! మా చెవిలో పువ్వులు పెట్టకండి - మంచుబీరువా లేకపోయినా, మంచినీళ్ళకుండ కొనకపోయినా ఫరవాలేదు. ఇంట్లో ఉన్న బిందెకు తడిగుడ్డచుట్టినా నీళ్ళు కాస్త చల్లగా ఉంటాయి కదా!" అన్నాను.

"ఇంట్లో బిందెలుంటేగా! ఉన్న సామాను మా పిల్లలు కావాలన్నారు; పట్టుకుపొమ్మన్నాను."

"మీ ఆవిడ ఊరుకున్నారా?" అడిగాడు కృష్ణమూర్తి.

"ఆవిడకేం తెలుసూ, ఎక్కడో ఆశ్రమంలో ఉంటున్న దానికి?"

"అదేం?" అన్నాను.

"నాతో వేగలేక!" అన్నారు, బోసి నోటితో నవ్వుతూ.

"పోనీ, కొడుకుల దగ్గర ఉండొచ్చు కదా!" అన్నాడు కృష్ణమూర్తి.

"ఉండమంటే కదా? వాళ్ళు రమ్మనరు - డబ్బు ఖర్చని; కోడళ్ళు రానివ్వరు - ఆవిడ నోటికి జడిసి! ఆవిడగారు ఎప్పుడు, ఎక్కడ ఉంటా నన్నా నా పెన్షన్‌లోంచి సగం డబ్బు పంపుతూనే ఉన్నాలే," అన్నారు, మమ్మల్ని ఓదారుస్తున్నట్టు.

వెంకటసుబ్బయ్యగారు కాలేజీ లెక్చరరుగా ఉన్నప్పట్నుంచీ, ఎంత ఉత్సాహంగా ఎంత సాయిలా పాయిలాగా మాట్లాడతారో మాకు తెలుసు. నీరసం, నిరాశ ఎన్నడూ ఎరగరు. వయస్సు పైబడినందుకు కాస్త శరీరం వంగిందేమో కాని, చైతన్యం తరగలేదు!




నానక్‌సింగ్, ఇ.నెం.9-4-66, బురుడ్‌గల్లి, నిజామాబాద్.

"ఏమయ్యా! నీ ఇంటికి టెలిఫోను వచ్చిందట; నంబరు ఇచ్చావు కాదేం? నాకు టెలిఫోను లేదనా?" అన్నారాయన, హఠాత్తుగా.

"ఎందుకంటావేమో! ఇంట్లో ఇంకెవరూ లేరు కదా- నాకేమయినా అయితే నీకు ఫోన్ చేద్దామని ఏర్పాట్లకోసం!' అన్నారు వెంకటసుబ్బయ్యగారు.

" ఆ ఏర్పాట్లు అప్పటికప్పుడు చెయ్యాలంటే కష్టమండీ! మీరు ఒకరోజు ముందుగానే ఫోన్‌చెయ్యాలి!' అన్నాను.

కృష్ణమూర్తికి మా మాటలు నచ్చలేదు. విషయం మార్చాలని ఆయన ఆరోగ్యాన్ని మెచ్చుకుంటూ మాట్లాడాడు.

"మీ ఆరోగ్య కీలకం ఏమిటో చెప్పండీ!" అని కూడా అడిగాడు.

వెంకటసుబ్బయ్యగారు చటుక్కున లేచి లోపలికి వెళ్ళారు. మూడు తెల్లటి సీసాలు తీసుకువచ్చారు. రెండు మాకు ఇచ్చి ఒకటి ఆయన తీసుకొన్నారు.

"మజ్జిగను మించిన అమృతం మరొకటిలేదని మా మేనత్త చెప్పింది. నేనూ అదే చెబుతున్నాను. ఆవిడ తొంభై నాలుగేళ్ళు బతికింది. ఎవరూ దిష్టికొట్టకపోతే సెంచరీ కొట్టేది. నాకింకా ఎనభైనిండలేదుగా!" అంటూ మజ్జిగ సీసా ఖాళీ చేశారు.

ఏం మనిషి! ఏం ఉత్సాహం! ఏమి ఆత్మ విశ్వాసం!

ఇంతలో వీధిలోంచి ఎవరో పిలిచారు. వెంకట సుబ్బయ్యగారు తాళంచెవి తీసుకొని వెళ్ళారు. నలుగురు ఆడవాళ్ళు బిందెలతో పంపు దగ్గరికి వచ్చారు.

"ఏమమ్మా! నిన్న చెప్పిన పాఠం రాశారా?" అని అడిగారు వాళ్ళని వెంకటసుబ్బయ్యగారు.

"లేదయ్యా, అప్పటికి రాసి తెస్తం!" అన్నారు వాళ్ళు.

ఆయన లోపలికి వచ్చారు.

"ఈ గోడల మీద ఫాన్లు ఎందుకో తెలుసా? వీళ్ళకోసం, వీళ్ళ పిల్లల కోసం! వీళ్ళు నా శిష్యురాళ్ళు! మధ్యాహ్నం పూటవచ్చి, ఆ వసారాలో కూర్చుని చదువుకుంటారు మగవాళ్ళు రాత్రిపూట వచ్చి చదువుకుంటారు అదు నెలల్లో అవలీలగా పుస్తకం చదతారు!" అంటూ ఆయన చెబుతూండగా పాతికేళ్ళ యువకుడొకడు మెల్లగా లోపలికి ప్రవేశించి.

"నమస్తే, అయ్యా మీకోరకు జున్ను దెచ్చినా! లోపల పెట్టాల్నా?" అంటూ అడిగాడు.

"జున్ను సంగతి సరేలే! ఇక్కడ కూర్చో చెప్తాను!" అన్నారు వెంకటసుబ్బయ్యగారు.

'ఇతను పున్నయ్య! చిన్నప్పుడు చదువుకోలేదు. చాలా కాలం మా ఇంట్లో పాలుపోసేవాడు. అందరి ఇళ్ళకూ వెళ్ళి పాలుపోశాక, చివర్లో మా ఇంటికి వచ్చేవాడు. రోజు కొక గంట నా దగ్గర కూర్చునేవాడు. అక్షరాలూ, గుణింతాలూ, ఎక్కాలూ, లెక్కలూ, నేర్చుకున్నాడు. పుస్తకం పట్టాడు. తెలుగు గడగడా చదవడం వచ్చాక, ఇంగ్లీషు నేర్చుకోవాలని సరదాపడ్డాడు. ఇది ఏడాది కిందటి మాట!' అంటూ ఆయన, ఆరోజు వచ్చిన ఇంగ్లీషు పేపరు వెతికితెచ్చారు.

'పున్నయ్యా, మావాళ్ళకు పేపరు చదివి వినిపించు!' అన్నారు బుజం తడుతూ.

అతను ఒక్కొక్క వార్తే చక్కని ఉచ్చారణతో స్పష్టంగా చదువుతూంటే మేము నోళ్ళు వెళ్ళబెట్టాం. కాసేపు ఉండి పున్నయ్య వెళ్ళిపోయాడు.

అన్నట్టు, చెప్పడం మరిచిపోయాను. వెంకట సుబ్బయ్య గారు చదివిందీ, కాలేజీలో విద్యార్థులకు ముప్పై యేళ్ళు నేర్పిందీ రసాయనశాస్త్రం.

ఆరోజుల్లోనే, రాగిని బంగారంగా మార్చే రసవాద విద్యలోతు తెలుసుకో డానికి ఆయన ఎన్నో పుస్తకాలు చదివారు. ప్రయోగాలు చేశారు.

దాన్ని గురించి మా తోటివాళ్ళతో ఉత్సాహంగా చెబుతూండేవారు. ఆ సంగతి, ఎందుకో నాకు గుర్తొచ్చింది. పున్నయ్య పేపరు బాగా చదివినందుకు మెచ్చుకొని, రసవాద విద్యలో పరిశోధన ఎంతవరకు ఫలించిందీ చెప్పమని వెంకటసుబ్బయ్యగారిని అడిగాను.

ఆయన ఒక్కక్షణం కళ్ళు మూసుకున్నారు.

"నేను పరిశోధించిన రసవాదం వేరు; నేను సాధించిన రసవాదం వేరు!

రసవాద విద్యలో, రాగిని బంగారంగా మార్చే ప్రక్రియ ఉందని మా గురువు గారు నమ్మారు.

రాజమండ్రిలో సారంగధర మెట్ట దగ్గర ఒక బైరాగి ఆ ప్రక్రియ చేస్తూ ఉంటే ఆయన కళ్ళారా చూశారట!

ఆయన మాట నేను నమ్మాను. దాన్ని గురించి చాలా పుస్తకాలు చదివాను; ప్రయోగాలు చేశాను.

అది మా గురువు గారికీ పట్టుబడలేదు, నాకూ పట్టుబడలేదు. వదిలేశాను.

కాని, మట్టినీ, మనిషినీ బంగారంగా మార్చే రసవాదాన్ని పట్టుకున్నాను. రకరకాల ప్రయోగాలు చేశాను. ఒంతో నిరుత్సాహం కలిగేది, నిరాశ ఆవరించేది. అయినా లొంగిపోలేదు, పట్టినపట్టు విడవలేదు.

తిండి సరిగాలేక బక్కచిక్కిన పిల్లలు రోజూ పాలు తాగకపోతే ఎలా?

ఇంటిపనులతో ఎప్పుడూ సతమతమవుతూ ఉండే ఆడవాళ్ళు ఎప్పుడూ చదువుకోకుండానే ఉండిపోతే ఎలా?

కాయకష్టం చేసే వాళ్ళకు మనం రాత్రి అయినా చదువు చెప్పకపోతే ఎలా?

వాళ్ళ తిండి తిప్పల గురించీ ఆరోగ్యం గురించి తెలియజెప్పకపోతే ఎలా?

ఇవన్నీ నా సొంత సమస్యలే అనుకున్నాను. ఇవన్నీ నేను చెయ్యవలసిన పనులే అనుకున్నాను.

మన సంగతి మీకు తెలుసుగా! అనుకున్నాక పనులలో పెట్టడానికి ఆలస్యం ఉండదు.

ఇది మా ఆవిడకు సరిపడలేదు. చీటికీ మాటికీ నాతో కజ్జా పెట్టుకునేది. అలిగి ఆశ్రమానికి వెళ్ళిపోతానంది. సరే, వెళ్ళమన్నాను.

నా కొడుకులకు పట్నాల్లో డబ్బు అవసరం చాలా ఉంటుందట! ఉన్నదేదో ఇప్పుడే పంచిపెట్టమన్నారు. బిందెలూ, చెంబులతో సహా ఉన్న సామానంతా పంచేశాను. వాళ్ళు దాచుకున్నారో, అమ్ముకున్నారో నాకు అనవసరం వెళ్ళి వాళ్ళు ఇటువైపు తొంగి చూడలేదు. రాకపోకల ఖర్చులు ఎవరు ఇస్తారు కనక!

ఇంక, నేనంటావా! నా ఒక్కడి కోసం వంట ఎంతసేపు పడుతుంది. అదికూడా ఒక్కపూటే! నావంట గిన్నెలు నేనే తోముకుంటాను. నా బట్టలు నేనే ఉతుక్కుంటాను. నేను పని మనిషిని పెట్టుకోను. నా సత్తువ మీద నాక్కు నమ్మకముంది.

నీకు ఇప్పట్లో నాదగ్గర్నించి టెలిఫోను పిలుపు రాదు! ఏమీ అనుకోకు!" అన్నారు వెంకట సుబ్బయ్య గారు. నామీద జాలి చూపిస్తూ..

ఏమంటాం? అప్పటికి ఎండబాగా ముదిరింది. కృష్ణమూర్తి లేచాడు.

"ఎండలో ఏం వెడతారు? కిచిడీ వండి పెడతాను. తిని, కాస్సేపు విశ్రాంతి తీసుకుని చల్లబాటు వేళ వెళ్ళండి. అన్నారు వెంకటసుబ్బయ్యగారు.

"ఇప్పుడు కాదు. మరో మాటు వస్తాం. మిమ్మల్ని ఒంటరిగా వదలం!" అన్నాడు కృష్ణమూర్తి.

"నాకు ఒంటరితనమా?" అన్నారాయన ఆశ్చర్యంగా.

"అయ్యా! మీరెప్పటికీ ఒంటరివారు కారని మాకు తెలుసు. ఇంట్లో ఉండేది ఒక్కరే అయినా, ఈ దొడ్లో ఉన్న మొక్కలూ, పాదులూ, ఈ చుట్టు పక్కలున్న మరి వీళ్ళే మీ పిల్లలూ మనమలూ!

మీది పెద్ద సంసారం! మట్టి మనిషిని బంగారంగా మార్చే రసవాదమే మీ తపస్సు! మీ మేనత్తగారి మాట ఏమయినా - ఈ మజ్జిగ టానిక్కుతో - మీరు తప్పకుండా సెంచరీ కొడతారు!" అన్నాను నేనుకూడా లేస్తూ.

"ఇంతకీ, నీ టెలిఫోన్ నంబరు ఇచ్చావు కావు!" అన్నారు వెంకటసుబ్బయ్యగారు నిష్ఠూరంగా.

"ఇంకెందుకూ?" అన్నాను.

"సెంచరీ కొట్టడానికి నాకింకా టైముందనుకో! కాని అప్పటిదాకా నీ యోగక్షేమాలు నేనే చూసుకోవాలి కదా! అప్పుడప్పుడు నిన్ను పలకరిద్దామనీ!" అంటూ మమ్మల్ని సాగనంపడానికి వచ్చారు వెంకటసుబ్బయ్యగారు.

**డాక్టర్ పోరంకి దక్షిణమూర్తి**
ఇ.నం. 1-100, చైతన్యపురి, పి టి టి కాలనీ, హైదరాబాద్.